# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 5.00

సెప్టెంబర్ 2022



పాఠకులకు విజయదశమి శుభాకాంక్షలు

ఆగష్టు 13న శ్రీ కాళీవనాశ్రమంలోని ఆశ్రిత ఆశ్రయం ప్రారంభోత్సవ దృశ్యములు



శ్రీ మాతాజీ వేంచేయుట



ఆశ్రిత ఆశ్రయం ప్రవేశం



విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం



విజిటర్స్ బుక్‌లో సంతకం చేయుట

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 42 సంచిక 1
పేజీలు 44
సెప్టెంబర్ 2022

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 7

అగస్త్య హృదయం ....................... ..............9

శ్రీదండి స్వామి బోధ. ........................11

దేవహూతి ..................................................13

ఆశ్రమ స్వర్ణోత్సవ వివరాలు......................15

దూత పాత్రలో దుష్టి ................................16

కూర్మ పృష్ట జయిష్ణు ప్రపదాన్వితా.......18

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................20

దర్శనం ....................................................21

కైవల్యోపనిషత్ ... ......................................25

గురువు ....................................................27

నేను ఎవరు? ...........................................29

పురంజనోపాఖ్యానం.......................................30

తంగెళ్ళోజు బాలకృష్ణయ్య ........................32

వివేక చూడామణి ................ .................34

నిరీక్షణ .......................................................36

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ....... ............................ ...................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

26) 'రా' కలుషంబులెల్ల బవయంబడద్రోచిన 'మా' క వాటమై
డీకొనిప్రోవుచునిక్కమనిధీయుతులెన్నదదీయ వర్ణముల్
గైకొని భక్తి చే నుడువగానరు గాక విపత్పరంపరల్
దాకొనునే జగజ్జనుల దాశరథీ! కరుణాపయోనిధీ!



భావం - 'రా' అనే అక్షరం పాపములను పారద్రోలగా, 'మా' అను అక్షరం వాకిలియై పాపముల జొరనీయకుండును అని పెద్దలైనవారు పై 'రామ' యను అక్షరముల బుద్ధిమంతులు భక్తితో పలుకకుందురేగాని, పలికినట్లైన ఆపదలు ప్రపంచ జనుల గ్రమ్ముకొనవు దాశరథీ! కరుణాపయోనిధీ!

*దేవాలయానికి రావడం వల్ల ఒరిగేదేమిటి?

*నువ్వు ఎందులో వుంటే మాయ నిన్ను ఏమీ చేయలేదు?

*శ్రీబాబు ఏ రూపంలో నరసింహమూర్తిని వెనుకకు రప్పించారు?

*అడగని ప్రశ్నలకు చెప్పకుండనే సమాధానాలు ఎలా వస్తాయి?

*శిల్పంలో స్వామిని చూడాలంటే ఏం కావాలి?

*ఏ రెండు కలిగి వుంటే జ్ఞానం లభిస్తుంది?

*పరమాత్ముడు ఎవరిని పట్టుకుంటాడు?

*ఎవరు ఈ జన్మలోనే కడతేరుతారు?

*పోయిందనుకున్న డబ్బు సంచి ఎలా తిరిగి వచ్చింది?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

3-7-1981

ఈ రోజు రాత్రి 8గం లకు శ్రీబాబూజీ దర్శనం ఇచ్చారు. అంధ్రప్రభ ఎడిటర్ సుబ్రహ్మణ్యంగారు, మద్రాసులో ఎడిటర్‌గా పనిచేస్తున్న ఆయన మిత్రుడు కలిసి శ్రీబాబూజీ దర్శనార్థం వచ్చారు. మద్రాసు ఎడిటర్‌గారు ఒక అమెరికా దేశస్థుడైన యోగిద్వారా ఉపదేశం పొందిన సంగతి శ్రీ బాబుకి నివేదించారు. మద్రాసు ఎడిటర్‌గారికి శ్యామ్ అనే నామధ్యానం చేయమని చెప్పారట. ప్రాణాయామము, యోగాసనాలు కూడా చేయమని చెప్పారట. వారు శ్రీబాబూజీని దర్శించాలని వచ్చారు. శ్రీబాబూజీని మహా పురుషులుగా భావించి, ఆయన తన సందేహ నివృత్తి కోసం వచ్చారు.



శ్రీబాబూజీ మద్రాసు ఎడిటర్ గారిని ఉద్దేశించి ప్రసంగించారు. 'పరమాత్ముడు ఏ జీవుడిని ఎలా తరింపజేస్తాడో, ఏ జీవుని ఎలా తనదరి చేర్చుకుంటాడో ఎవరు చెప్పగలరు? అది ఆ పరమాత్మ ఒక్కడికే తెలుస్తుంది. పరమాత్ముడికి అనంతకోటి నామాలున్నాయి. వాటిలో ఏ ఒక్కనామాన్ని స్మరించినా చాలు, ఆనందాన్ని పొందడానికి. రామ్ అన్నా, శ్యామ్ అన్నా, అమ్మా అన్నా, ఓం నమఃశివాయ అన్నా వాడు తప్పక తరించగల్గుతాడు.

పరమాత్ముడు మధురస్వరూపుడు. పంచదార చిలక వుందనుకోండి, దానిని ఎక్కడ కొరికినా మధురంగానే ఉంటుంది. గోమాత ఉందనుకోండి, నల్లగా ఉన్నా, తెల్లగా ఉన్నా ఎర్రగా ఉన్నా ఆగోమాత క్షీరము తెలుపు వర్ణమే కదా! భక్తుని పరమాత్ముడు పట్టుకుంటాడు. పరమాత్ముని జ్ఞాని పట్టుకుంటాడు. భక్తునికి పరమాత్మునికి గల సంబంధము, మార్జాల కిశోర న్యాయము. జ్ఞానికి పరమాత్మకి గల సంబంధము, మర్కట కిశోర న్యాయము.

మహాత్ములు చేసే బోధ హృదయానికి హత్తుకుంటుంది. అదే పండితులైతే రాగయుక్తంగా శ్లోకాలు చదివి అర్థం చెప్తారు గాని తమ

అనుభవాన్ని అందజేయలేరు. అదే జ్ఞాని అయితే తాను అనుభవపూర్వకంగా పొందిన ఆనందాన్ని అందజేస్తాడు. శ్రీ రామకృష్ణ పరమహంస, గోవింద భగవత్పాదులు, శ్రీశంకర భగవత్పాదులవారు, గురునానక్ అందజేసిన సందేశాలకి, మహాపండితులు అందజేసిన సందేశాలకి తేడా లేదా? శాస్త్రకారులు, జీవకోటి యొక్క సందేహాలను నివృత్తి చేయలేరు. ఎందుచేత? వారికి అనుభవంలేదు కాబట్టి.

శ్రీవివేకానందుడు ఎంతమంది పండితులనో కలుసుకున్నాడు. ఆయన వారందరిని 'మీరు భగవంతుని దర్శించారా? దర్శిస్తే నాకు భగవంతుని చూపగలరా?' అని ప్రశ్నించాడు. బ్రహ్మసమాజ వ్యవస్థాపకుడైన శ్రీ రాజారామ మోహనరాయ్‌ని కూడా కలుసుకున్నాడు. కాని ఆయన కూడ వివేకానందుని సందేహము తీర్చలేక పోయారు. చివరికి శ్రీరామకృష్ణ పరమహంసని కలుసుకున్నారు. శ్రీరామకృష్ణ పరమహంస నిరాడంబరుడు. పిచ్చివాడిలా ఉండేవాడు. అందరూ ఆయనని పిచ్చి పూజారి అని పిలిచేవారు. కాని వివేకానందుని ప్రశ్నకి సమాధానము చెప్పగల్గిన ధీరుడు ఆయన ఒక్కడే.

వివేకానందుడు ఆయనని 'మీరు భగవంతుని దర్శించారా?' అని ప్రశ్నించగానే 'ఆ చూశాను' అని సమాధానము యిచ్చాడు. 'ఎక్కడ?' అని వివేకానందుడు ప్రశ్నించేసరికి 'ఇక్కడే' అని సమాధానమిచ్చాడు శ్రీరామకృష్ణ పరమహంస. 'ఎప్పుడూ' అని ప్రశ్నించాడు వివేకానందుడు. 'ఇప్పుడూ, ఎల్లప్పుడూ నాలో, నీలో, సర్వ ప్రకృతిలో చూస్తున్నాను' అన్న శ్రీరామకృష్ణుని మాట వివేకాందుని హృదయానికి సూటిగా హత్తుకుంది.

ఆ ఒక్కమాటతో వివేకానందునిలో స్వల్పమైన మార్పు వచ్చింది. 'అయితే నాకు చూపగలరా?' అని ప్రశ్నించాడు. 'తప్పకుండా అయితే నేను చెప్పినట్లు చేస్తే మాత్రమే' నంటాడు శ్రీ రామకృష్ణ పరమహంస.

వెంటనే శ్రీ రామకృష్ణ పరమహంస వివేకానందుని స్పృశించేసరికి విచిత్రానుభూతిని పొందుతాడు. అంతే వివేకానందుడు శ్రీరామకృష్ణ పరమహంసని గురువుగా ఎంచుకుని మహాపురుషుడయ్యాడు. చూశారా! మహాత్ములను నమ్ముకున్న వారికి నమ్ముకున్నంత. నమ్మనివారికి బూడిదే" అన్నారు శ్రీబాబూజీ.

(గత సంచిక తరువాయి)

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***దేనిని ఆశించాలి?***

పాండవులకి కృష్ణయ్య ప్రక్కనే వుండి, ఆత్మ బంధువై, అడుగడుగునా వారిని రక్షించలేదా? ద్రౌపదికి వస్త్రాపహరణం జరిగిననాడు ఎవరు రక్షించారు? ఆపద్బాంధవుడు ఆదుకున్నాడు. ఆవిడ తనను తాను రక్షించుకోవాలని కొంతసేపు ప్రయత్నం చేసింది. కానీ, తనవల్ల కాదు అని తెలిసి 'ఆపద్బాంధవా! ఆత్మస్వరూపా! కృష్ణా! రక్షించు' అనేసరికి, 'ఓయ్!' అంటూ వచ్చేశాడాయన. అజ్ఞాన వలువలు ఊడిపోనిచ్చి, అక్షయమైన జ్ఞాన వస్త్రాన్ని ప్రసాదించి, ద్రౌపదిని రక్షించాడు. తన భర్తలు, పుత్రులు, బంధువులు, విద్యా గురువులు ఎవ్వరూ ఈ ప్రపంచం నుండి తనను కాపాడలేరని గుర్తించి, చివరికి భగవంతుడిని శరణు కోరింది. ధన ధాన్యాల నుండి ఘన బిరుదాల నుండి రక్షించేది ఆయన ఒక్కడే!



ఇలా చెప్పుకుంటూ పోతే సరిపోదు. మరేం చేయాలి? అది మాయ యొక్క ప్రభావం అని గుర్తించి, జాగ్రత్త కలిగి నడచుకోవాలి. తెలియక పోవటం, అన్నీ నాకే తెలుసు అనుకోవడం ఇదంతా మాయయే. ఏది తెలుసుకుంటే ఇక తెలుసుకోవలసినది లేదో దానిని తెలుసుకోవాలి. అది తెలిపేవారు సద్గురుదేవులు. మాటలు మాత్రమే కాదు కావలసినది చేతలు కావాలి. మాటలాడుతున్నంత సేపూ అనుభవం రాదు. అనుభవం వస్తే మాటలు ఆగిపోతాయి. నిశ్శబ్దం, మౌనం మాత్రమే మిగులుతాయి. ఏది ఎంత కావలసి వున్నదో, ఏది అక్కరలేదో తెలుసుకోవాలి. ఇది తెలిపేది ఒక్క గురుబోధ మాత్రమే.

చెప్పుకోవడం, వినడం, అనడంతోనే సరిపెట్టుకోకూడదు. లేకపోతే అవి కూడా ఒక వాసనగా మారిపోతాయి. అలా కాకూడదు. చెప్పుకుంటూ వెళ్ళేది జ్ఞానం కాదు. జ్ఞానమనేది అనుభవైకవేద్యం. మనం అనుభవానికి తెచ్చుకున్న జ్ఞానం మన చేతలలో, నడకలో

ప్రతిబింబిస్తుంది. నీలోనికి నువ్వు వెళ్ళిపోవాలి. నీ ఎరుకలో నువ్వుంటే మాయ నిన్ను ఏమీ చేయలేదు. అప్పుడు తికమకపడటం వుండదు. వున్నది ఒకే ఒక పరమాత్మ వస్తువు అని తెలుసుకుంటావు. ఆ పరమాత్మ నీలో 'నేను'గా 'ఆత్మ'గా ప్రకాశిస్తున్నాడని గుర్తిస్తావు.

'నువ్వంటే నేనయ్యా నేనంటే నువ్వేనయ్యా' అంటే ఉపాధులకి తావులేదు. అది కేవలం ఆత్మసంబంధం. ఏ పరమాత్మనయితే నీవు 'పరమాత్మ' అని ఆరాధిస్తున్నావో, ఆ పరమాత్మే నీలో 'జీవాత్మ'గా వున్నాడు. 'జీవ', 'పర' అనే భేదాలు తీసివేస్తే వుండేది 'ఆత్మ' ఒక్కటే.

అటువంటి ఆత్మవస్తువుని గుర్తించడానికి కావలసిన సాధన సంపత్తిని, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ ఆయురారోగ్య, ఐశ్వర్యాలను ప్రసాదించి సర్వదా గురుపాదుకలు కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**సెప్టెంబర్ 2022**

10 శని - భాద్రపద పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

20 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

26 సోమ -శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం.

**అక్టోబర్ 2022**

3 సోమ - దుర్గాష్టమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

4 మంగళ - మహర్నవమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

5 బుధ - విజయదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

9 ఆది - ఆశ్వయుజ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

20 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

24 సోమ - నరక చతుర్దశి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

25 మంగళ - దీపావళి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ. పాక్షిక సూర్య గ్రహణం

29 శని - నాగుల చవితి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**తప్త చామీకరాభాయ వహ్నాయే విశ్వకర్మణే।**

**నమస్తమోభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే॥**

**తాత్పర్యము** - కరిగించిన బంగారము యొక్క వర్ణము కలవాడవునూ, ఆహుతులను గ్రహించువాడవునూ, సర్వజగత్కర్తవూ, తమస్సులను నిరోధించువాడవూ, ప్రకాశ స్వరూపుడవై లోకములకు సాక్షిగా నిలబడిన ఓ భాస్కరుడా! నీకు నమస్కారము!

ఈ శ్లోకము ద్వారా అగస్త్యులు గురుహృదయమును ఆవిష్కరిస్తూ సాధకుడికి వుండవలసిన లక్షణములతో పాటు ధ్యానయోగ ప్రక్రియను బోధిస్తున్నారు.

**తప్త చామీకరాభాయ** అంటూ కరిగించిన బంగారపు మేలిమి రంగుతో సూర్యుని వర్ణిస్తున్నారు. లోహములన్నిటిలోనికి శ్రేష్ఠమైనది బంగారము. కరిగించిన బంగారము మరింత ప్రకాశమును అందిస్తుంది. అదేవిధంగా దుర్లభమైన నరజన్మ లభించిన తరువాత సాధకుడు ముముక్షువై గురువుని సమాశ్రయించాలి. అంతటితో సరిపెట్టుకోక నిరంతరమూ గురుధ్యానములో తపించే సాధకుని మనస్సు తప్తకాంచనము వలే ప్రకాశిస్తుంది. నిజానికి ఆ ప్రకాశము హృదయంలో నెలకొని వున్న మన హృదయబాబు ప్రకాశమే కదా!

అటువంటి సాధకుని మనస్సు నిరంతరమూ గురుచింతనలో నిమగ్నమై కర్మబీజ నాశనమునకు దారితీస్తుంది. శ్రీబాబూజీ మహారాజ్ పలుమార్లు **ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి** అంటూ గురుధ్యానములో వుండి కర్మ రాహిత్యమును పొందే సాధకుడి స్థితిని వివరించేవారు. ఆ ధ్యానాగ్నిని రగిలింపగలిగిన గురుపరమాత్మనే అగస్త్యులు **వహ్నాయే** అన్న సంబోధన ద్వారా తెలియజేస్తున్నారు. అటువంటి స్థితిని పొందిన సాధకుడు విశ్వములోని సర్వస్వమునూ తన గురుకృపగా భావించి గురుదేవులనే విశ్వకర్మగా గుర్తించగలుగుతాడు. వారికి ప్రకృతి, పురుషుడు మరియు సర్వ క్షేత్రములయందు గురుదర్శనము అవుతుంది. విశ్వకర్మణి అన్న అగస్త్యుల సంబోధన ఈ సంగతినే నిగూఢంగా తెలియజేస్తోంది.

శ్రీబాబూజీ వారి స్తోత్రనామాలలో ఓం **విశ్వ కారణాయ నమః** అని స్తుతించుకునే నామములోని అంతరార్థము అదే!

అంధకారమును తొలగించి జ్ఞానజ్యోతిని ప్రసరింపజేసిన గురుదేవులే తిరిగి తనను ఆశ్రయించిన వారు మాయలో పడకుండా కాపాడతారు. కానీ, ఆ మాయను దాటడానికి ఆయననే శరణువేడాలి. **మామేవ యే ప్రపద్యన్తే ఏతాం మాయాం తరన్తితే** అని గీతాచార్యులు ఇచ్చిన అభయం అదే కదా! అలాంటి తమస్సును తిరిగి రాకుండా నిరోధించగల గురుదేవులను **నమస్తమోభినిఘ్నాయ** అంటూ అగస్త్యులు సంబోధిస్తున్నారు.

**రుచయే** అన్న శబ్దము గురుదేవుల ప్రకాశ తత్వమునూ, వెలుగునూ సూచిస్తోంది. అంతేకాక, **పిబరే రామ రసం** అంటూ మధురమైన రామ రసాయనము యొక్క రుచిని అందించి, దానిలో ఓలలాడించిన సద్గురుదేవులను ఈ సంబోధన తెలియజేస్తోంది. **ఓం రుచిరాయ నమః** అన్న సద్గురుదేవుల నామము వెనుక వున్న భావము అదే!

ధ్యానాగ్నితో కర్మబీజములు నశింపజేసుకుంటూ గురురామ నామ రసపానములో మత్తెక్కిన సాధకుడు జగత్తుతో మమేకం చెందకుండా ఒక సాక్షిగా లేదా ద్రష్టగా మిగిలిపోతాడు. **యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయః** అని వివరించినట్లు ద్వైత భావన విడనాడి తన గురుదేవుడిని లోకసాక్షిగా, సర్వసాక్షిగా గుర్తించగలుగుతాడు. దీనినే అగస్త్యులు **లోకసాక్షిణే** అన్న ప్రస్తావన ద్వారా వివరిస్తున్నారు. **ఓం సర్వసాక్షిణే నమః** అని స్తుతించుకునే సద్గురుదేవుల దివ్యనామము కూడా ఈ అంశమునే తెలియజేస్తుంది.

ఈ విధంగా ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు గుహ్యంగా సాధకునికి వుండవలసిన తపనతోపాటు సాధనాక్రమములో పొందవలసిన పరిణతినీ, దానిని ప్రసాదించే గురుకృపనీ తెలియజేస్తున్నారు.

- సశేషం

# శ్రీ దండి నిర్మలానందగిరి స్వామి బోధ

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

'ఉన్నాడయా దేవుడున్నాడయా! తెర వెనుక తానుండి తైతక్కలాడుతూ కన్నులకు కనిపించకున్నాడయా! లోకాల చీకటులు పోకార్ప రవి చంద్ర దీపాల గగనాన తిప్పేనయా!' ఆయన ఆడిస్తే మనం ఆడుతున్నాం. ఆడించేవాడు భగవంతుడు. ఆయన మీద దృష్టి పెట్టుకో!

బుద్ధి, చిత్తము, అహంకారము - ఒకటే. మనస్సు చేసే కార్యాలబట్టి ఆయా పేర్లు వచ్చాయి. చెరువులు గుండ్రంగా ఉండవచ్చు; నలు చదరంగా ఉండవచ్చు ; త్రికోణాకారంగా ఉండవచ్చు. వాటిలో నీరు ఒకటే. వృత్తి కూడా అలాంటిదే. సంకల్ప వికల్పం చేస్తే మనస్సైంది; చింతన చేస్తే చిత్తమైంది; హుంకరిస్తే అహంకారమైంది; నిశ్చయిస్తే బుద్ధి అయింది. సత్సంగానికి రావాలని మనస్సు సంకల్పిస్తుంది ; "అమ్మ" వచ్చాక వెళ్ళవచ్చు కదా!" అని చిత్తం చింతన చేస్తుంది; ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెళ్దాం అని బుద్ధి నిశ్చయిస్తుంది, వెంటనే బయల్దేరి వస్తావు. అది నీ అహంకారం చేయిస్తుంది. అలా మనం చేసే ప్రతి పనిలో మనో బుద్ధి చిత్తాహంకారాలు పని చేస్తుంటాయి. నీ నిత్య జీవితంలోనే వుంది వేదాంతము.

ధ్యానానికి కూర్చున్నావు. నీ మనస్సు బయటకి పోతోంది. అప్పుడు జపం చెయ్యి. **"జపతో నాస్తి పాతకమ్"** నీలో పాపం ఉంది కాబట్టే నీకు ధ్యానం కుదరటం లేదు. పాపం పోవటానికి జపం చెయ్యి. మనస్సు నిలుస్తుంది. అప్పుడు ధ్యానం చెయ్యి. నా గడియారం అంటావు. అలాగే మనస్సు నీ కంటె వేరు కాదు. **"అయమాత్మా బ్రహ్మ"** , **"అహం బ్రహ్మాస్మి"** అని బ్రహ్మ భావంలో ఉండు.

"మనస్సు అతి చంచలము దానిని నిగ్రహించటం గాలిని అణిచి పెట్టటం ఎంత కష్ట సాధ్యమో అంత దుష్కరము" అని అర్జునుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, "అర్జునా! నిజమే! కాని వైరాగ్యము వల్ల, నిరంతర అభ్యాసం వల్ల మనస్సును నిగ్రహింపవచ్చును" అని సమాధానం చెబుతాడు భగవానుడు.

"నేను శరీరాదులు కాదు; నేను మనస్సు కాదు; మనస్సు జడం. నేను మనస్సులోని భావాలు భావాలను తెలుసుకొనేవాడిని. ద్రష్టను., బ్రహ్మను అని బ్రహ్మ భావంలో ఉండు. నీ దృష్టిని భ్రూమధ్యంలో నిలిపితే శ్వాస ఆగిపోతుంది. ఈ ప్రపంచం మిథ్య అని నిశ్చయ జ్ఞానం కలిగి అపరోక్షానుభూతి సిద్ధిస్తుంది.

శ్రవణం వలన మల దోషము పోతుంది. సేవ చేసి శ్రవణం చెయ్యి. **"గురువాక్యం తు కర్తవ్యం"** "అర్జునా! అవిగో చాతక పక్షులు" అని గురువైన ద్రోణాచార్యులవారు అంటే, "అవును గురుదేవా! అవి చాతక పక్షులే" అంటాడు. కాదు "కాదు అవి కొంగలు" అంటే, 'అవును స్వామీ! అవి కొంగలే!" అంటాడు. 'అదేమిటి? నేను చాతక పక్షులు అంటే అవునన్నావు. ఇప్పుడు అవి కొంగలు అంటే కొంగలే అన్నావు?' అంటే, 'గురుదేవా! నాకు పక్షులు అనవసరం. నాకు మీ మాట ముఖ్యం' అంటాడు అర్జునుడు. అలా శ్రవణం చేస్తే అది పట్టుకుంటుంది. వంటిమీద చీమ పాకినా శరీర ధ్యాస లేకుండా ఎవరు శ్రవణం చేస్తారో వారు ఈ జన్మలోనే కడతేరుతారు. అర్జునుడు అలా శ్రవణం చేశాడు. అతనికి సందేహ నివృత్తి అయింది.. గురు బోధ వింటే అన్ని దోషాలు పోతాయి.

అలా మీ అందరికి మల విక్షేప దోషాలు తొలగి, గురువాక్య శ్రవణంద్వారా ఆవరణ దోషం తొలగి **"అహంబ్రహ్మాస్మి"**అనే వృత్తి కలిగి, **"సాక్షాత్ బ్రహ్మమే నేను"** అనే దృఢ అపరోక్ష జ్ఞానం మీ అందరికీ గురువులు కలుగజేయుదురు గాక!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు బాదరవాడ రవిమోహన రాజుగారు 8-8-2022 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# దేవహూతి

(గత సంచిక తరువాయి)

సేకరణ - సుధాకర్ భోగరాజు

ఆ ప్రశ్నలకి తెల్లబోతూ ‘ధర్మానికి కృతజ్ఞత ఎలా చెప్తాం? ఋతువుకి తగ్గవాటిని ఫలింపజేయడం ఋతుధర్మం కదా?” అని ఎదురు ప్రశ్నించింది. కపిలుడు మందహాసం చేసి ‘అంటే, ఋతువు ఎలాంటి ఫలం, కృతజ్ఞత ఆశించకుండా తన ధర్మాన్ని నెరవేరుస్తోందన్న మాట! మరి, అరటి సంగతేమిటి? అరటిచెట్టు కాయలిస్తోంది. పళ్ళు యిస్తోంది. అరటి ఊచ యిస్తోంది. ఈ మూడూ మనకి ఆహారంగా ఉపయోగపడుతున్నాయి. అలాగే అరటి ఆకులు మనకి ఆరోగ్యానిస్తున్నాయి. శుభ కార్యాల సంధర్భాల్లో అరటి పిలకలు తెచ్చి ద్వారాల ముందు నిలుపుతున్నాం. ఇన్ని విధాలా ఉపయోగపడుతున్న అరటికి ఎలాంటి ప్రతిఫలం లభిస్తోంది? దాని ఆకులు నరుకుతున్నాం. కాయలు నరుకుతున్నాం. అరటిబోదె నరుకుతున్నాం. చివరికి దాన్ని తీసిపారేస్తున్నాం. మనం ఇన్ని విధాలుగా హింసించి కృతఘ్నులం అవుతున్నా అరటిచెట్టు తన ధర్మాన్ని తాను నెరవేరుస్తుంది. మన నుంచి ప్రతిఫలం, కృతజ్ఞత ఆశించకుండా ఋతువులు, చెట్లు వాటి ధర్మాన్ని అవి నెరవేరుస్తున్నాయి.

మరి, ఇన్నింటి మీద ఆధారపడిన యీ దేహం తన ‘దేహధర్మం’ నిర్వర్తిస్తోందనీ, ఆ దేహధర్మం ప్రతిఫలం, కృతజ్ఞతల కోసం ఆశపడేది కాదని గ్రహించలేవా తల్లీ!’ అని ప్రశ్నించాడు కపిలుడు సూటిగా. నిశ్చేష్టురాలైంది దేవహూతి. కపిలుడు మందహాసం చేసి ‘అమ్మా! నువ్వు బాల్య, యవ్వన, కౌమార దశలు గడిపి సేవలు చేశానన్నావు. ‘నువ్వు’ అంటే ఎవరు? ఈ నీ దేహమా? దేహం ఎప్పటికైనా పతనమైపోయేదే కదా! నశించిపోయే దేహం కోసం చింతిస్తావెందుకు? ఒక శరీరాన్ని నీ ‘తండ్రి’ అన్నావు. మరొక శరీరాన్ని నీ ‘భర్త’ అన్నావు. మరికొన్ని దేహాలని ‘సంతానం’ అన్నావు. ఈ దేహాలన్నీ నువ్వు సృష్టించావా? లేదే! నీ తల్లి, తండ్రి అనే దేహాలని ఎవరు నిర్మించారో నీకు తెలియదు. నీ భర్త దేహాన్ని ఎవరు నిర్మించారో నీకు తెలియదు. నీ ఈ దేహం ఎలా తయారైందో, నీ సంతానంగా చెప్పుకుంటున్న ఆ దేహాలు నీ గర్భవాసంలో ఎవరు తయారుచేశారో నీకు తెలియదు. నీ దేహమే నువ్వు నిర్మించలేనప్పుడు

నీది కాని పరాయి దేహాలపై వ్యామోహం ఎందుకమ్మా?' అని అన్నాడు. దేవహూతి నిర్విణ్ణురాలైంది.

కపిలుడు మందహాసం చేసి ఆమెకు సాంఖ్యయోగమును ఉపదేశించసాగాడు, 'అమ్మా! మనస్సు అనేది బంధ, మోక్షములకు కారణం. ప్రకృతి పురుష సంయోగం చేత సృష్టి జరుగుతుంది. ఆ పురుషుడే ప్రకృతి మాయలో పడి కర్మపాశం తగుల్కొని దుఃఖ భాజనుడవుతాడు. నేను, నాది, నావాళ్ళు అన్న ఆశాపాశంలో చిక్కుకొని జనన మరణ చక్రంలో పడి అలమటిస్తూ అనేక జన్మలెత్తుతాడు. జన్మ జన్మకో శరీరాన్ని ధరిస్తాడు. ఏ జన్మకి ఆ జన్మలో 'ఇది నాది, ఈ దేహం నాది, నేను, నా వాళ్ళు' అన్న భ్రమలో మునిగివుంటాడే గాని, నిజానికి ఏ జన్మా, ఏ దేహం శాశ్వతం కాదు. తనది కాదు.

దేహంలోని జీవుడు బయల్వెడలినప్పుడు, మృత్యువు సంభవించినప్పుడు ఆ దేహం కూడా అతడిని అనుసరించదు. ఇంక, 'నా వాళ్ళు' అనుకునే దేహాలు ఎందుకు అనుసరిస్తాయి? దేహత్యాగంతోటే దేహం ద్వారా ఏర్పడ్డ కర్మబంధాలన్నీ తెగిపోతాయి. ఆఖరికి ఆ దేహంతోటి అనుబంధం కూడా తెగిపోతుంది. ఇలా తెగిపోయే దేహబంధాన్ని, నశించిపోయే దేహ సంబంధాన్ని శాశ్వతం అనుకుని దానిపై వ్యామోహం పెంచుకునేవారు ఇహ-పర సుఖాలకి దూరమై, జన్మరాహిత్య మోక్షపదాన్ని చేరలేక దుఃఖిస్తుంటారు. కానీ ఆ జీవుడే తామరాకు మీది నీటిబిందువువలె దేహకర్మబంధాలకి అతీతుడై, దేహధర్మానికి మాత్రం తాను నిమిత్తమాత్రుడై ఉండి, ఆచరించినట్లయితే కర్మబంధాలకు, దేహబంధాలకు అతీతంగా, ఆత్మరూపుడై ద్వందా తీతుడవుతాడు. అరటి పిలక మొక్క అవుతుంది. ఆకులు వేస్తుంది. పువ్వు పుష్పిస్తుంది. కాయ కాస్తుంది. కాయ పండు అవుతుంది. అది పరుల ఆకలి తీర్చడానికి నిస్వార్థంగా ఉపయోగపడుతుంది. అనంతరం ఆ చెట్టు నశించిపోతుంది. దానిస్థానంలో మరొక మొక్క పుడుతుంది. ఈ పరిణామక్రమంలో ఏ దశలోనూ 'తనది' అనేదేదీ దానికి లేదు. పుట్టడం, పెరగడం, పుష్పించడం, పరులకి ఉపయోగపడడం, రూపనాశనం పొందడం ఇది దాని సృష్టి ధర్మం.

- సశేషం

## *శ్రీ సద్గురు స్వామి స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవ మహోత్సవములు*

**శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి చతుస్త్రింశత్(34వ) వార్షిక పుణ్యారాధన మహోత్సవములు, శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగము, అఖండ హరినామ సంకీర్తన, త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళన**

ది.11.11.2022 శుక్రవారము నుండి 21.11.2022 సోమవారము వరకు

**ఆహ్వానము**

ఆధ్యాత్మిక జిజ్ఞాసువులారా!

శ్రీ కాళీ వనాశ్రమము (శ్రీ కాళీ గార్డెన్స్) పరీధావి నామ సంవత్సర నిజ వైశాఖబహుళ తదియ బుధవారము అనగా ది.31.05.1972న శ్రీ బాబూ విజ్ఞాన మందిర్ గృహప్రవేశముతో ప్రారంభింపబడి 50 సంవత్సరములు పూర్తి చేసుకొన్న సందర్భముగా శ్రీ శుభకృత్ నామ సంవత్సర కార్తీకబహుళ తదియ శుక్రవారమునుండి కార్తీక బహుళ ద్వాదశి (తత్కాల త్రయోదశి) సోమవారము వరకు అనగా ది.11.11.2022 నుండి 21.11.2022 వరకు శ్రీ సద్గురుదేవుల పరమానుగ్రహముతో స్వర్ణోత్సవ మహోత్సవములు, అఖండ హరినామ సంకీర్తన, పరమహంస పరివ్రాజకాచార్య పరమ పూజ్యపాద శ్రీ శ్రీ శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి సర్వాధ్యక్షతన త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము (19.11.2022 నుండి 21.11.2022) నిర్వహించు కొనుచున్నాము. ఆస్తిక మహాశయులందరూ ఈ కార్యక్రమములలో పాల్గొని, భక్తుల సేవచేసుకొని తరించగలరని ఆశించుచున్నాము.

**నిత్య కార్యక్రమములు:**

మేలుకొలుపు, సుప్రభాతం, ప్రార్థన, శ్రీ సద్గురు పాదుకా ప్రదక్షిణ, పాశుపత వజ్ర గ్రథితమహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగము, తీర్థ ప్రసాదములు, అఖండ హరినామ సంకీర్తన, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ లక్షనామార్చాన, హోమం, దర్బారు, మహాప్రసాదం.

**కార్తీకమాసము సందర్భంగా ప్రతిరోజూ మహన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకములు జరుగును.**

వివరములకు...

93465 35357

93983 34345

ఇట్లు

కార్యనిర్వాహక వర్గము

# దూత పాత్రలో దుప్పి

- జగన్నాథ ప్రసాద్

భక్తులకు శ్రీబాబు తమ బోధను అందిస్తూ మధ్యలో ఎవరినైనా లేపుతూ వుండేవారు. ఆ భక్తుడితో ఏదైనా చెప్పేవారు. వారు చెప్పే సంగతి ఆ భక్తుడికి సంబంధం లేని పరిస్థితిలో అతను అర్థం కాక తెల్లముఖం వేసేవాడు. 'నీకు కాదులే అసలైనవాడు వేరే వున్నాడు' అనేవారు శ్రీబాబు. ఇంతలో ఆ లక్ష్య భక్తుడు అర్థం చేసుకుని, తానే అని గ్రహించి సభలో లేచి నిలబడేవాడు. 'దేహాభిమనం వుండరాదు' అని చెప్పి శ్రీబాబు తమ బోధను తిరిగి కొనసాగించేవారు.

అలాగే భక్తులకు సద్గురువు పంపించే వర్తమానం పరిపరి విధాలుగా అందుతుంది. సరిగా గ్రహించే శక్తి ఆ భక్తుడికి వుండాలి. ఆ గ్రహింపు కూడా గురువు ఆశీస్సులతోనే లభ్యమవుతుంది.

ఈ క్రింది సంఘటన సుమారు 1973 లో జరిగింది. శ్రీ భోగరాజు నరసింహమూర్తిగారు కుటుంబం ఏలూరులో వుండేవారు. వారు ఏలూరు, అశోక్‌నగర్‌లోని కె.పి.డి.టి. హైస్కూల్ లో గుమాస్తాగా పనిచేసేవారు. వారికి ధ్యానం అంటే చాలా మక్కువ, శ్రద్ధ. ఇంటిలో ఎక్కువ సమయం ధ్యానంలో గడిపేవారు. ప్రతి శనివారం సాయంత్రం బయలుదేరి ఆశ్రమానికి వచ్చేవారు. తిరిగి ఆదివారం సాయంత్రం ఏలూరు వెళ్ళిపోయేవారు. శెలవు దినాలలో వీలునుబట్టి కుటుంబ సభ్యులతో కలసివచ్చేవారు లేదా వారు ఒక్కరే వచ్చి బాబు దర్శనం, అమ్మగది దర్శనం చేసుకుని, ప్రార్థన సత్సంగాలలో పాల్గొని తిరిగి ఏలూరు వెళ్ళిపోయేవారు.

అదే విధంగా వారు ఒకసారి ఆశ్రమానికి వచ్చి, తిరిగి ఆ మరునాడు సాయంత్రం బయలుదేరి ఏలూరు వెళ్ళిపోవడానికి రైల్వే స్టేషన్‌కు నడుచుకుంటూ బయలుదేరారు. మధ్యలో వారు దేనికో వెనక్కి తిరిగి చూసే సరికి ఆయన వెనకాలే ఆశ్రమంలో వుండే 'రాము' అనే దుప్పి వస్తోంది. అది గమనించిన నరసింహమూర్తిగారు 'అయ్యో! ఇది మన ఆశ్రమంలో నుండి పొరపాటున బయటకు వచ్చేసింది. తప్పిపోతుందేమో, ఎటైనా వెళ్ళిపోతుందేమో అనుకుని కంగారుగా దాన్ని 'పో! పో! అంటూ వెనక్కి ఆశ్రమంలోకి తరుముతున్నారు. అయినా అది

కదలకుండా ఈయననే అనుసరిస్తూ వెనకాలే వస్తోంది. ఇహ చేసేది లేక ఆయన అక్కడ వున్న చిన్న కట్టతో దాన్ని బెదిరిస్తూ ఆశ్రమంలోకి తోలుకుంటూ తీసుకువచ్చారు.

ఈలోగా ఆశ్రమంలో ప్రార్థనానంతరం శ్రీబాబు సత్సంగం జరుగుతుంది అనే విషయం తెలిసి వెంటనే ఆయన ప్రయాణం ఆపివేసుకుని వచ్చి బాబు విజ్ఞాన మందిరం హాలులోకి వెళ్ళి కూర్చున్నారు. శ్రీబాబు ఆరోజు ధ్యానం గురించి చాలా సేపు ఎంతో చక్కగా బోధించారు.

నరసింహమూర్తిగారు ఎంతో ఆనందపడిపోయారు. 'ఇదే నేను ఏలూరు వెళ్ళిపోయి వుంటే ఈ సదావకాశాన్ని పోగొట్టుకుని వుండేవాడిని కదా! ఆ దుప్పి రాముకి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

'ఈ రోజు సత్సంగం జరుగుతుంది, దానికి ఈయన రావాలి, నేను తీసుకువెళ్ళాలి' అనే సంగతి ఆ దుప్పికి తెలుసా?

'నరసింహమూర్తి సత్సంగానికి రావాలి, ధ్యానం గురించి ఆయన తెలుసుకోవాలి' అనే సంకల్పం శ్రీబాబుది. వారు తమ సంకల్పాన్ని ఆ (రాము) దుప్పికి అందించారు. ఆ దుప్పి తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చింది. కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చిన దూత కదా మన దుప్పి రాము!

సత్సంగం అయ్యాక నరసింహమూర్తిగారు శ్రీబాబుకు నమస్కరించి, జరిగిన విషయం ఆయనకు తెలియజేసి, ఆయన అనుమతి, ఆశీస్సులు కూడా తీసుకుని తిరిగి ఆ రాత్రి ఏలూరు ప్రయాణమయ్యారు! సంతోషంతో నిండిన మనస్సుతో! ఆ విధంగా ఆ దుప్పి రూపంలో శ్రీబాబు నరసింహమూర్తిని వెనకకు రప్పించి, ఆయన ధ్యానానికి కావలసిన బోధను అందించారు!

# కూర్మపృష్ఠ జయిష్ణు ప్రపదాన్వితా

(గత సంచిక తరువాయి)

-హనుమత్ జయప్రద. భాగవతుల

ఇందులో శమము, దమము - అంతరేంద్రియ నిగ్రహాన్ని, బాహ్యేంద్రియ నిగ్రహాన్ని సూచిస్తున్నాయి. ఉపరతి - మనసుయొక్క వృత్తి - శబ్దస్పర్శాది విషయముల ఆకారమును ధరింపకుండా ఉండటం, తితీక్ష-సంభవించిన దుఃఖమును నివారించటానికి ఏ ప్రయత్నమును ఆచరింపక సహించటం, శ్రద్ధ - శాస్త్రమున గురువాక్యమున సత్యత్వబుద్ధి, సమాధానము -బుద్ధిని శుద్ధబ్రహ్మ పదార్థమున నిలపడం, ముముక్షుత - మోక్ష ప్రాప్తికైన తీవ్రేచ్ఛ. తాబేలు ఎలా ఐతే నిగ్రహాన్ని కలిగి ఉన్నదో సాధకుడు అయినటువంటి వాడు తన యొక్క అంతరేంద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహాన్ని కలిగి వుండగలగాలి. ఇదే విషయము శ్రీ కృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్పి ఉన్నారు.

**శ్రద్ధావాన్ లభతేజ్ఞానం తత్పరః సంయతేంద్రియః**

**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిమచిరేణాధిగచ్ఛతి**

ఎవరైతే శ్రద్ధ కలిగి, ఇంద్రియ నిగ్రహము కలిగి ఉంటారో వారికి జ్ఞానము లభిస్తుంది. అటువంటి జ్ఞానము లభించగానే పరమ శాంతి లభిస్తుంది. తాబేలు తన యొక్క పిల్లలని మనసులో తలుచుకోవడం తోనే వాటియొక్క పోషణ చెయ్యగలదు అని శ్రీ బాబూజీ మహారాజ్ చెప్పియున్నారు. మనం బాహ్యంగా ఎంత దూరాన ఉన్నాకూడా, ఆశ్రమానికి వెళ్ళలేకున్నా కానీ, మన మనసులో ఏ కష్టం వచ్చినా మన మనసులో తలచుకోగానే 'నేను నీతో ఉన్నా , భయపడకు' (Why Fear?, I am Here) అని ఎప్పడు మన రక్షణ , మన పోషణ భారం ఆయన మీదనే వేసుకున్నారు.

2006-2007 మధ్యలో నేను అమ్మ(శ్రీ మాతాజీ) ఆదేశం మేరకు హైదరాబాద్ ఆశ్రమంలో ఉండటం జరిగింది. అప్పడు హైదరాబాద్ ఆశ్రమం చిన్న ప్రదేశంలో ఉంది. 3 గదులు, వెనక వంటగది, పైన 2 గదులు ఉండేవి. ప్రతి రోజు యధావిధి నిత్యప్రార్థన, పూజ జరిగేవి. ప్రతి ఆదివారం సాయంత్రం సంకీర్తన, సత్సంగం జరిగేవి. ఒక ఆదివారం

అక్కడ వున్న ప్రాంతం అంతా నీళ్లు పోసి శుభ్రం చేస్తున్నాము. నేను అదే సమయంలో నీళ్లలో 10 మెట్లు జారి కింద పడిపోయాను. ఆ తర్వాత కొన్ని నెలల పాటు విపరీతమైన నడుము నొప్పితో బాధ పడ్డాను. ఆ నొప్పి ఎంత తీవ్రమైనది అంటే, అది ఎడమ కాలుకి మొత్తం పాకింది. ఒక్కోసారి నుంచోవడం కూడా చాలా కష్టం అయ్యేది.

2008 లో నేను ముంబయిలో పని చేస్తున్నపుడు ఒకసారి నంబూరు ఆశ్రమానికి వచ్చాను. అపుడు శ్రీ మాతాజీ వారి దర్శన భాగ్యం కలిగింది. ఆ రోజు అమ్మతో మాట్లాడుతూ ఉంటే, హఠాత్తుగా అమ్మ తన పాదకమలాలను నా రెండు తొడల మీద పెట్టారు. అంతటి అదృష్టం కలిగి నందుకు నేను లోలోపల చాల తృప్తితో, ఆనందంతో సేవ చేసుకుంటూ ఉంటే, వెంటనే అమ్మ నా ఎడమ తొడ మధ్యలో గట్టిగ తమయొక్క పాదంతో నొక్కసాగారు. అది ఎంత గట్టిగా నొక్కారు అంటే ఆ క్షణం లో నా ప్రాణం పోతుంది ఏమో అని అనిపించింది. నేను ఏం మాట్లాడకుండా అమ్మని అలాగే చూస్తూ ఉండిపోయా. అలా ఎంత సేపు అయిందో తెలియలేదు. కాసేపటికి నా కాలు స్పర్శ కోల్పోయింది. ఆ తర్వాత అమ్మ చిరుమందహాసం చేసారు. అంతే! ఆ తర్వాత ఎన్ని నెలలుగానో వేధిస్తున్న నా నడుము నొప్పి, కాలి నొప్పి తగ్గాయి.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటి అంటే మనము ఏ విషయమైనా డైరెక్ట్‌గా చెప్పకపోయినా కూడా గురుదేవునికి సర్వం తెలిసిపోతుంది. గురుదేవుల ముఖస్తుగా జాలువారే పదములు మంత్రపూరితములు అయితే, వారి పాదములు మనకి జనన మరణ విషయాదుల నుండి విముక్తి ప్రసాదించి అనిర్వచనీయమైనటువంటి ఆనందాన్ని ఇచ్చేటువంటివి. శ్రీ గురుకృపాహి కేవలం! జై గురుదేవ్!

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2022**

5 సోమ - ఉపాధ్యాయ దినోత్సవం

10 శని - భాద్రపద పూర్ణిమ- ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం - శ్రీసద్గురు పాదపూజ

20 మంగళ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

24 శని - మాస శివరాత్రి

25 ఆది - అమావాస్య.

26 సోమ - శ్రీ శరన్నవరాత్రి మహోత్సవ ప్రారంభం. ఉదయం 8.01ని॥ అంకురార్పణ.

**అక్టోబర్ 2022**

2 ఆది - మూలా నక్షత్రం - సరస్వతీపూజ.

3 సోమ - దుర్గాష్టమి

4 మంగళ - మహర్నవమి - సామూహిక కుంకుమ పూజలు

5 బుధ - విజయదశమి - సామూహిక కుంకుమ పూజలు. నామకరణాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు చేయించదలచుకున్న వారు ఆ రోజు 8గం.లకు వస్తు సామాగ్రితో సిద్ధంగా వుండవలెను.

6 గురు - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురుపాదపూజ.

9 ఆది - ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం. శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

20 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

23 ఆది - మాస శివరాత్రి

24 సోమ - నరక చతుర్దశి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

25 మంగళ - దీపావళి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన, పాక్షిక సూర్య గ్రహణం.

26 బుధ - కార్తీక శుద్ధ పాడ్యమి - ఆకాశదీప ప్రారంభం.

27 గురు - 27 నుండి నవంబర్ 4వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పించామృతములు, నవ రసములతో అకాదశ రుద్రాభిషేకములు, లక్షబిల్వార్చన.

29 శని - నాగుల చవితి.


దర్శనం
మధుప
ప్రభూ! ఇప్పటిదాకా నేను నీవి ఎన్నెన్నో శిల్పాలు చెక్కాను. ఇప్పుడు నీ దర్శనానికి వస్తున్నాను. అనుగ్రహించు.
1
స్వామీ! నేను మీకు ఎన్నెన్నో నగలను తయారుచేశాను. ఇన్నాళ్టికి నీ దర్శనానికి బయలుదేర గలిగాను.
2


దేవా! నేను ఆగమశాస్త్రం ప్రకారం ఎన్నెన్నో దేవాలయాల రూపకల్పన చేశాను. ఇప్పటికి దేవాదిదేవుడవైన నీ ఆలయానికి రాగలుగుతున్నాను.
3


ఓ పరంధామా! నాకు నీవు తప్ప మరేదీ తెలియదు. ఇంత కాలానికి నీ దర్శనభాగ్యం కల్పిస్తున్నావా తండ్రీ!
4


ఓహో! ఈ శిల్పాన్ని చెక్కడానికి ఫలానా శిలను వాడారన్నమాట! అక్కడక్కడా చిన్న లోపాలున్నా శిల్పి పనితనం బాగుంది.
5


ఈ నగల పనితనం విచిత్రంగా ఉంది. ఎవరు చేశారో? ఆ పెద్ద హారానికైతే కనీసం కేజీ బంగారమైనా పట్టి ఉంటుంది.
6


ఈ ఆలయ నిర్మాణంలో ఆగమశాస్త్ర సూత్రాలన్నీ బాగానే పాటించినట్లున్నారు!
7


ఆహా! ప్రభూ! ఎంత దివ్యమంగళ మూర్తివయ్యా! నీ దర్శనం లభించిన నా జన్మ ధన్యం స్వామీ!
శిల్పంలో స్వామిని దర్శించాలంటే కావలసినది భక్తి మాత్రమే
8

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

అన్నిటికంటే స్థూలమైనది భూమి. సూక్ష్మమైనది ఆకాశం. భూమికి గుణం గంధం. అది ఒక్కటే కాక, మిగిలిన మహా భూతాల యొక్క శబ్ద స్పర్శాది గుణాలు కూడా వున్నాయి భూమికి కాబట్టి అది పంచేంద్రియాల చేత తెలిసికొనబడుతోంది. సూక్ష్మమైన ఆకాశం యొక్క గుణం శబ్దం. భూమి లోనుండి కూడా శబ్దాలు వినబడతాయి. ఆకాశం సర్వత్రా వ్యాపించి వున్నది. అది బుద్ధి గ్రాహ్యము. మనం బుద్ధితో తాదాత్మ్యం చెంది, బుద్ధి ద్వారా వ్యవహరిస్తున్నంత కాలం ఆకాశ భావం తొలగదు. ధ్యానంలో కూడా మనకి శబ్దం అలజడిని కలిగిస్తూనే వుంటుంది చివరి వరకూ. సవికల్ప సమాధిలో కూడా ఒక ధ్వని వుండనే వున్నది. ఆ ధ్వనిని దాటిపోవడమంటే, జీవభావం దాటిపోవడమే. ఎవడైతే బుద్ధిని దాటిపోతున్నాడో అతడు ఆత్మానుభూతిని పొంది, ఆత్మగా జీవిస్తున్నాడు. అందువలన సహజంగానే అతను పంచమహాభూతాలనూ దాటిన అతీత స్థితిలో వుంటాడు. వ్యష్టి (వ్యక్తి) రూపంలో ఇంద్రియాలు వుంటే, వాటి యొక్క సమష్టి రూపంలో పంచమహాభూతాలుగా వున్నాయి. అందరిలో వున్న తనని తాను గుర్తించడమే సమష్టి భావన.

ఈ విధంగా తనలోని పరమాత్మ రూపాన్ని తెలుసుకుని, ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, పరిమిత భావం నుండి, ప్రకృతి బంధాల నుండి అతడు విముక్తుడవుతాడు.

ఆ పరమాత్మ సర్వవ్యాపి కావడం వలన దానిలో కళలు, విభాగాలు వుండటానికి వీలులేదు. ఇవన్నీ పరిమితమైన వస్తువులకు, రూపాలకు వుంటాయి. రూపం వుంటే నశించి తీరాలి. కానీ, అక్షరం, నిత్యం అయిన ఆత్మ రూపాధికమై సర్వవ్యాపి. ఆత్మలో ఇతరమైనది ఏదీ లేదు., అపరిమితమైనది కాబట్టి నిష్కళకం, అద్వితీయం.

ఆత్మ ఎప్పుడూ మనో బుద్ధుల వ్యవహారాలలో చిక్కుకోలేదు. ఎల్లప్పుడు వీటికి దూరంగా నిలిచి ఉదాసీనంగా అన్నిటినీ చూస్తూ వాటికి తన శక్తిని అందజేస్తుంది. కాబట్టి అది సమస్త సాక్షి

**ఆత్మ సదసద్విహీనం. సత్ అసత్**లు వివేక దృష్టికి సంబంధించినవి. ఈ నిర్ణయాలు బుద్ధి నిర్ణయిస్తుంది. సత్ అంటే అనుభవించేది. అసత్

అంటే ప్రపంచం. దానికి కూడా శక్తినిచ్చేది సత్. అసత్ (ప్రపంచం) ఇంద్రియాలకి గోచరమయ్యేది. సత్ అసత్ కూడా లేనిది తానే. **తత్ త్వమేవ త్వమేవ తత్. సత్ అసత్** భావాలను ప్రకాశింపజేస్తుంది. వాటికంటే అతీతమైనది సదసద్విహీనం.

నిష్కళమై, అద్వయమై, సమస్తసాక్షియై, సదసద్విహీనమైన ఆ పరమాత్మను తెలుసుకోవలసినదేగాని, దానిని ఎక్కడ వున్నట్లు తెలుసుకోవాలి? అది సర్వవ్యాపియై, సమస్తమునకు అతీతమై వుండటం వలన అది బుద్ధికి గోచరం కాదు **బుద్ధిగ్రాహ్య మతీంద్రియం**. దానికి స్వంతంగా ఒక స్థానం లేదు. కాని ఈ విచారణ ద్వారా దీనిని గుర్తించడమవుతుంది. దేహానికి ఇంద్రియాలన్నీ వుంటాయి. కానీ ప్రాణ రూపంలో వున్న చైతన్యం తప్పుకోవడం వలన పడుకోబెట్టిన ఆ మనిషి శరీరం అలాగే వుంటుంది. అది ఇంకా కాసేపు వుంచితే పాడయిపోతుంది. కానీ ప్రపంచం అలాగే వుంటుంది. ప్రాణ రూపంలో వున్న చైతన్యం వున్నంత వరకే ఆ మనిషికి విలువ. ఎవరికి సంబంధించిన మనిషిని వారు తీసుకువెళ్ళిన తరువాత కార్యక్రమం చేస్తారు. అదే మనిషి ఎవరికీ సంబంధించిన వాడు కాకపోతే, బయట పెంటకుప్ప మీద పడవేస్తారు. చేతులు, కాళ్ళు లేక ఇహ ఏ అవయమైనా యాక్సిడెంట్‌లో ఏదైనా పోయినా, ఉచ్ఛ్వాసనిశ్వాసలు వుంటే, అంటే ప్రాణ రూపంలో వున్న చైతన్యం ఇంకా వుంటే, ఆ శరీరాన్ని ఇంకా వుంచుకుంటారు. అది గమనించవలసిన విషయం!

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***సెప్టెంబర్ 2022 :*** AS 6912, 7577, 7580, 7581, 7591, 7850, 8860-8867, 8876. LM 4356, 4358. •

***అక్టోబర్ 2022 :*** AS 6867, 7173, 7377, 7601, 7602, 7912, 8398-8404, 8406-8409, 8413, 8414, 8416, 8421, 8881-8903, 8909, 8910, 8912-8914.

## గురువు

- పాలూరి కాళీప్రసాద్

మన భారతీయ సంప్రదాయంలో గురువును త్రిమూర్త్యాత్మక స్వరూపుడిగానే కాక సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడిగా భావించి పూజిస్తారు. కేవలం భావించడమే కాదు, సత్యగురువు నిజంగా పరబ్రహ్మ స్వరూపుడే. అయితే నేటి సమాజంలో రకరకాల వ్యక్తులను గురు శబ్దంతో సంబోధించడం అలవాటుగా మారింది. టీచర్స్‌డేని ఒకప్పుడు ఉపాధ్యాయ దినోత్సవం అనేవారు. ఇప్పుడు ఎక్కువగా గురుపూజోత్సవం అంటున్నారు. అలాగే ప్రవచనాలు చెప్పేవారిని, జాతకాలు, పంచాంగాలు చెప్పేవారిని, పురోహితులను ఇలా ఒకరేమిటి కాస్త శాస్త్రజ్ఞానం ఉన్నట్లు కనబడిన ప్రతివారిని గురువులుగా సంబోధిస్తున్నారు. ఇంకొంతమందికి తమ స్నేహితులను, ఇంకా అపరిచితులను కూడా గురూ అని పిలవటం ఒక అలవాటు. అయితే గురుశబ్దం చాలా లోతైనది. మానవుని హృదయాంతరాళంలో కరడుగట్టిన అజ్ఞానాంధకారాన్ని తన జ్ఞానభాస్కర కిరణ ప్రసారంతో రూపుమాపి మానవుని మాధవునిగా పరివర్తనం చెందించే సమర్థత ఒక్క గురువుకే సొంతం.

పాఠశాలలో అధ్యయనం చేసేవాడు విద్యార్థి. అతనితో పాటుగా కలిసి చదువుకొనేవారు సహాధ్యాయులు. అలాగే వీరి అధ్యయనానికి ఉపకరిస్తూ, వారికి నేర్పే క్రమంలో ప్రతిరోజూ తాము కూడా క్రొత్త క్రొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండేవారు ఉపాధ్యాయులు. ఒక ఉపాధ్యాయుడికి తన పాఠ్య విషయంలోనే పట్టు ఉంటుంది. అది కూడా వందశాతం కాదు. తాను అంతవరకు చదవని విషయంమీద ఏ విద్యార్థో ప్రశ్నిస్తే, మర్నాడు తెలుసుకొని వచ్చి సమాధానం చెప్పవలసిందే. కానీ గురువు సర్వజ్ఞుడు. ఈ అనంత విశ్వంలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలో ఆయనకు తెలియని విషయం అంటూ ఏదీ ఉండదు. పైకి కనబడే విషయాలే కాక ప్రతి జీవి మనస్సు పొరలలో కప్పబడి ఉన్న సంకల్పాలు, వాసనలు అన్నీ వారికి ఎఱుకే. కొందరు ఉపాధ్యాయుల మధ్య పోటీ ఉంటుంది. ఒకరు చెప్పిన దాన్ని మరొకరు అంగీకరించడానికి అహంకారం అడ్డు వస్తుంది. కానీ నిజమైన గురువులు అలా కాదు. వారి దృష్టిలో అసలు ఈ భేదాలే ఉండవు.

వున్నదంతా తమ స్వరూపమే.

గురువు ముందుగా తాను భవబంధాల నుండి ముక్తుడై వుండాలి. అయితే అది మాత్రమే సరిపోదు. తనను ఆశ్రయించిన వారిని ప్రేమతో చేరదీసి, తాను పొందుతున్న బ్రహ్మానందాన్ని వారికి కొద్దికొద్దిగా రుచి చూపిస్తూ, ఎప్పటికప్పుడు వారికి సాధనలో మార్గదర్శనం చేస్తూ, సాధనలో ఎదురయ్యే ఆటంకాలను, వెనక్కిలాగే నీచ భావాలను కనిపెట్టి కాచుకుంటూ, వారి ప్రతి సందేహాన్ని తీరుస్తూ సాధన పూర్తి చేయించి ముక్తిఫలాన్ని అందించగలిగిన సమర్థుడై ఉండాలి. కొంతమంది "విజ్ఞానం అంతా వేదాలలో, ఉపనిషత్తులలో నిక్షిప్తమై ఉంది కదా! అవి చదువుకుంటే సరిపోదా? ఇంకా గురువు ఎందుకు?" అని వాదిస్తారు. "గురువు లేని విద్య గుడ్డి విద్య" అన్నారు పెద్దలు. ఉదాహరణకి ఒక పెద్దమనిషి ఎక్కడో పురాణంలో "పరీక్షిత్తు మహారాజు నిమ్మకాయ వాసన చూస్తుంటే అందులోనుండి తక్షకుడు వచ్చి కాటువేయగా మరణించాడు" అని విని ఇక ప్రపంచంలో ఎవరూ నిమ్మకాయలు వాసన చూడకూడదని శాసిస్తాడు. "ఇదేమి చాదస్తం నాయనా?" అంటే "పురాణాలను చూసి ఏమీ నేర్చుకోరా? అంటే పురాణాలన్నీ వ్యర్థమేనా?" అని మొండిగా వాదిస్తాడు. పరీక్షిత్తు చరిత్ర నుంచి నేర్చుకోవలసింది ఇలాంటి మూఢనమ్మకాలనా? తనకు మరణం అసన్నమైనదని తెలియగానే ఒంటిస్తంభం మేడెక్కి తలుపులన్నీ మూసుకున్న పరీక్షిత్తే శుకబ్రహ్మ ముఖతః భాగవత ప్రవచాన్ని శ్రద్ధగా శ్రవణం చేసి, ఎప్పటికైనా మృత్యువు తప్పదనే సత్యాన్ని గ్రహించి మృత్యువును తానే ఆనందంగా స్వాగతించి భగవదనుభూతిలోనే దేహాన్ని విడిచిపెట్టి ముక్తిధామాన్ని చేరుకున్నాడు. కానీ గురువును ఆశ్రయించనివాడు, ఆశ్రయించినా శ్రద్ధగా గురుబోధను శ్రవణం చేసి, ఆకళింపు చేసుకొని అనుభవంలోకి తెచ్చుకోలేని వాడు ఇలాగే ప్రతిదానిలోనుండి తప్పుడు అర్థాలు తీస్తూ మూఢ నమ్మకాలు పెంచుకుంటూ ఏం చేస్తే ఏం నష్టం కలుగుతుందో అని అనుక్షణం భయంతో చస్తూ బ్రతుకుతాడు.

- సశేషం

# నేను ఎవరు?

- ప్రసాద్. ఎన్.

మనం కార్య కారణ సంబంధం గురించి మాట్లాడుతూ వుంటాము. బంగారం కారణం, గాజు కార్యం అని అంటాము. నిజానికి గాజు అనేది కొత్త వస్తువువేమీ కాదు. బంగారానికే గాజు అని ఇంకొక పేరు పెట్టుకున్నాము. అలాగే సత్యానికే మిథ్య అని ఇంకో పేరు పెట్టుకున్నాము. సత్యమే మిథ్యా వస్తువుగా భాసిస్తోంది. ఉన్నదంతా సత్యమే. అది నీవే.

భగవంతుడు సర్వగతం మరియు నిత్యం. సర్వగతం అంటే అంతటా వున్నాడని అర్థం. నిత్యము అంటే ఎల్లప్పుడూ వున్నాడని అర్థం. 'ఇక్కడ' అనేది అంతటా లోనే వున్నది. 'ఇప్పుడు' ఎల్లప్పుడూ లోనే వుంది. అంటే దాని అర్థం భగవానుడు ఇప్పుడే, ఇక్కడే వున్నాడు. అది ఎవరో కాదు నీవే.

కామ అంటే కోరిక. అది ఇంగ్లీషులో అయితే "," తో పోల్చవచ్చు. అంటే ఇంకా వున్నాయని అర్థం. కానీ నేను (బ్రహ్మము) మాత్రం సహజంగా పూర్ణత్వంతో వున్నాను. దానిని ఫుల్‌స్టాప్ "."తో పోల్చవచ్చు. కామ(,) వున్నంత వరకూ ఫుల్‌స్టాప్ (.) లేదు

భగవానుడికి ఒక నామం రూపం ఇవ్వడం ఒక విధంగా అవివేకమే. ఎందుకంటే పరిమితులు లేని వుఎస్తువుకి మనం పరిమితులు పెడుతున్నాము. కానీ, చిత్త శుద్ధి కోసం ఆయనకు ఒక నామం రూపం కల్పించి ధ్యానం చేయడం తప్పనిసరి. తరువాత మనం name and form transcend కావాలి. అదే transformation అంటే. అప్పుడు నీ స్వరూపం నీకు సాక్షాత్కారం అవుతుంది.

చాలా సిద్ధాంతాలు మతాలు భగవానుని ఒక వ్యక్తిగా పరిగణించి ఏదో ఒక లోకంలో వుంటూ ఈ సృష్టిని నడిపిస్తున్నాడు అని భావిస్తారు. మన వైదిక ధర్మం మాత్రం భగవానుని అవ్యక్త, అనుస్యుత, అపారమైన తెలివితో కూడిన సూత్రం 3వ principle గా, ఈ ప్రపంచం మొత్తం ఒక లయబద్ధంగా, ఒక ప్రణాళికతో నడిపిస్తున్న శక్తిగా భావన చేసింది.

# పురంజనోపాఖ్యానం

- ఎన్. కుట్టీ

పూర్వం పురంజనుడనే రాజు ఉండేవాడు. అతడు తపస్సు చేసుకొనుటకై అనువైన ప్రదేశం కొరకు దేశం నలుమూలలా తిరిగాడు. ఎంత తిరిగినా తపస్సు చేసుకొనుటకు అనువైన ప్రదేశం దొరకలేదు. అలా తిరిగి తిరిగి చివరకు హిమాలయాలకు చేరాడు. హిమాలయాలలో సంచరిస్తూ ఉండగా రాజుకు ఒక గుహ కనిపించింది. ఆ గుహ చూడడానికి చాలా అందంగా ఉంది. ఆ గుహ రాజుకు స్వర్గలోకమల్లే కనపడింది. తపస్సుకు ఇదే అనువైన ప్రదేశము అనుకుని పురంజనుడు ఆ గుహలో ప్రవేశించాడు.

ఆ గుహలో అడుగుపెట్టగానే రాజుకు నవద్వారాలు కనిపించాయి. మొదటి ద్వారం వద్దకు చేరుకోగానే, ఒక అందమైన స్త్రీ కనిపించింది. ఆమె వెంట పదిమంది సఖులున్నారు. ఐదు తలల సర్పం ఆ అందాల భామకు కాపలాగా ఉన్నది. ఆమె అచ్చు లక్ష్మీదేవిలాగా ఉన్నది. ఆ భామను, ఆమె అందాన్ని చూచి పురంజనునికి మతి పోయింది. రాజు తన మనసులో ఆహా! ఏమి ఈ సౌందర్యము. ఇలాంటి ప్రౌఢను నేను ఇది వరకు చూడలేదు. ఇక చూడనేమో? అచ్చం దేవ కన్యలాగా ఉన్నది. ఈ ఇలలో ఇలాంటి భామ ఉండదేమో అని తలచి, తను వచ్చిన పనిని మరచి, ఆమెను చూసి ఆకర్షితుడై మోహించాడు.

తక్షణమే ఆ భామ వద్దకు వెళ్ళి , తనను తాను పరిచయం చేసుకొని, కుశలప్రశ్నలు వేసి, నీ పేరేమిటి? నీవు ఎవరికి జనియించావు, నీ చుట్టుప్రక్కల ఉన్న వారెవరు అని అడిగాడు. అసలు ఈ గుహలో ఎందుకు ఉన్నావు? అని ఆ భామను ప్రశ్నించాడు. చూడు సాధ్వీ! నీ రూప లావణ్యాలు చూచి, నీమీద మనసు పడ్డాను. నిన్ను మనువాడాలని అనుకుంటు ఉన్నాను. నా హృదయ సింహాసనాన్ని అధిష్ఠించవా అని ఆ భామను ప్రాధేయ పడ్డాడు.

ఆ భామ కూడా రాజు మాటలకు సంతోషించి, చిరునవ్వుతో తన ఆమోదాన్ని తెలిపింది. రాజా! నాపేరు, నాకులం, నాగోత్రం, అడగవద్దు. దైవవశాత్తు ఈ గుహలో ఉంటున్నాను. ఈ గుహను నిర్మించినదెవరో నాకు తెలియదు. నా ప్రక్కన ఉన్నవారు ఎవరని

అడిగావు. వారు నా సఖులు. ఈ సర్పం అంటారా, నన్ను, నాగుహను ఎల్లవేళలా కాపాడతూ ఉంటుంది. అదృష్ట వశాత్తు నీవు ఈగుహలోకి వచ్చావు. ఈ నవ ద్వారాలు ఉన్న గుహను నీ వశం చేసుకొని నన్నేలుకో, అని చెప్పగానే పురంజన మహారాజు సంతోషంతో ఒప్పుకొని ఆ భామను మనువాడాడు.

ఆ గుహలో ఆ భామతో సుఖంగా కాలక్షేపం చేస్తూ జీవింప సాగాడు. ఆ గుహకు తొమ్మిది ద్వారాలు ఉన్నాయి. తూర్పున 5, పడమర 2, ఉత్తరము 1, దక్షిణము1 ఉన్నాయి. వాటి ద్వారా అనేక విషయాలను గ్రహించడానికి ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు. పురంజన మహారాజు విషయ సుఖాలను అనుభవిస్తూ, కామప్రేరితుడై, బుద్ధి అనే పట్టపు దేవి వల్ల వంచితుడయ్యాడు. అతని భార్య భామే బుద్ధి, ఆవిడ ఆడించినట్లు ఆడుతూ, పాడుతూ, కాపురం చేస్తూ రోజులు గడిపేస్తూ, ఒకరోజు భార్యను (అంటే బుద్ధిని) గుహలో వదలి పెట్టి, చెప్పకుండా అడవికి వేటకు వెళ్ళాడు.

వేట ముగిసిన తరువాత, పురంజన మహారాజు తన గుహకు విచ్చేసి, స్నాన పానాదులు ముగించుకుని, భోజనానంతరం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో భార్యపై మనసు మళ్ళింది. తక్షణమే, తన పత్ని వద్దకు వెళ్ళాడు. రాజు తనకు తెలియ చేయకుండా అరణ్యానికి వేటకు వెళ్లడాని ఆమె కోప గృహంలోనికి జారుకుంది. పురంజన మహారాజు తన ధర్మపత్ని వద్దకు వెళ్ళి తన తరపున తప్పు ఉంటే క్షమించమని కోరాడు. ఆమె మనస్సును ఆహ్లాదపరిచాడు.

భర్త మాటలకు ఆమె కోపం చల్లారింది. ఆమెతో ఆ రోజంతా చక్కగా గడిపారు. పురంజనుడు శృంగారమే జీవిత ధ్యేయంగా పగలు రేయి అనక గడుపుతున్నాడు. కాలాన్ని మరచాడు. యౌవనకాలం త్వరగా గడచి పోయింది. రాజుకు 111 మంది పుత్రులు, 110 మంది పుత్రికలు, కలిగారు. కొడుకులకు, కూతుళ్ళకు ఘనంగా వివాహాలు చేశాడు. ఒక్కొక్క కుమారుడకి 100 మంది కొడుకులు పుట్టారు.

- సశేషం

# తంగెళ్ళోజు బాలకృష్ణయ్య

సేకరణ - మురళీ

తంగెళ్ళోజు బాలకృష్ణయ్య మెదక్ జిల్లా, దుబ్బాక మండలం, పెదచీకోడు గ్రామంలో 1899 ఫిబ్రవరి 26న జన్మించారు. తంగెళ్ళోజు బాలకృష్ణయ్య. తల్లి సుభద్రమ్మ, తండ్రి నారాయణ. బాలకృష్ణయ్యకు యుక్త వయస్సు వచ్చిన తరువాత తల్లిదండ్రులు వివాహం చేయాలని తలపెట్టినా, బాలకృష్ణయ్య అందుకు అంగీకరించక తన 18వ ఏట ఒక సాధువు వద్ద ఉపదేశం పొంది కాళీ ఉపాసన మొదలు పెట్టాడు.

శ్రీ వెంకటయ్య పంతులు వద్ద హరికథలు చెప్పటం నేర్చుకొని భక్తి ప్రచారం చేయసాగాడు. చీకోడు సమీపానగల మల్లన్నగుట్ట గుహల్లో ఎవరికీ కనపడకుండా 12 సంవత్సరాలు చేసిన కఠోర తపస్సుకు ఆత్మసాక్షాత్కారం కలిగి అనేక సిద్ధులు పొందారు. వాక్శుద్ధి కలిగింది.

తండ్రి బలవంతము మీద ఇంటికి తిరిగి వచ్చి యోగము, ధ్యాన సాధన చేస్తుండేవాడు. గతంలో నేర్చుకున్న ఆయుర్వేద వైద్యం పరిణతి చెందింది. అనేకమంది భక్తులు, శిష్యులు చేరారు. తనను ఆశ్రయించిన రోగులకు తగిన సలహాలు యిచ్చి ఉపశమనం కలిగేలా చేసేవారు. భక్తులతో వేదాంత గోష్టి చేస్తూ సాధకులకు యోగ విద్యా రహస్యాలు బోధిస్తుండేవారు.

బాలకృష్ణయ్యకు గొప్ప వైద్యుడుగా, జ్యోతిష పండితుడిగా బాగా పేరు వచ్చింది. ఆయన చెప్పిన జాతకములు ఫలించేవి. వన మూలికలు తెప్పించి, ఇంటివద్దనే మందులు తయారు చేయించి యిచ్చేవారు. మూర్ఛ, పక్షవాతం, విషజ్వరాలు వంటి రోగాలతో బాధపడేవారికి బాలకృష్ణయ్య మందులతోపాటు పూజాకుంకుమ, విభూతి కూడా యిచ్చేవారు. వాటితో ఎంతో మంది స్వస్థత చెందారు. ఇంటిలో ప్రతినిత్యమూ ఎవరో ఒకరి కొరకు మందులు తయారు అవుతూనే వుండేవి. ఆయన ఇల్లు ఎప్పుడూ ఆధ్యాత్మిక జిజ్ఞాసువులతో, వేదాంత పండితులతో, గోష్టులతో కళకళలాడుతూ ఉండేది. అతిథి అభ్యాగతులకు వారి శిష్యులు పరిచర్యలు చేస్తుండేవారు.

బాలకృష్ణయ్య విద్యాగురువులు శ్రీ సాధు బ్రహ్మయ్య గారు. ఈయన కూడా చిన్నతనంలోనే ఇల్లు వదిలి, అనేక ప్రదేశాలు తిరిగి చివరకు చీకోడులోని బాలకృష్ణయ్య ఇంటికి చేరారు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు లేకుండా ఎప్పుడూ ధ్యానస్థితిలో ఉండేవారు. ఆయన గొప్ప సిద్ధపురుషుడని, అవధూతయని గ్రహించి బాలకృష్ణయ్య ఆయనను తమ ఇంటివద్దనే ఉంచుకుని సపర్యలు చేస్తూ, వారి మంచి చెడ్డలు చూసుకునేవారు. ఆయనకు ఎవరైనా తినుబండారాలిస్తే, అవి తను తినకుండా అందరికీ పంచేవారు. ఆయన ఆ వూరు వచ్చిన దగ్గరనుంచీ రోగాలు, అంటువ్యాధులు, దొంగతనాలు, దెబ్బలాటలు లేకుండా ఎంతో సుభిక్షముగా ఉంది. ఈయన చీకోడులో సుమారు 25 సం. నివసించి 19-03-1962న సిద్ధి పొందారు. బాలకృష్ణయ్య తమ ఇంటికి సమీపంలోనే వారికి సమాధి నిర్మింపజేసి ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రోజున ఆరాధనోత్సవాలు జరిపించేవారు.

బాలకృష్ణయ్యగారు లోకకళ్యాణం చేస్తూ తన 84వ యేట 26-5-1983 (వైశాఖ పూర్ణిమ) రోజున ధ్యానములో కూర్చుని దేహం చాలించారు. భక్తులు వేల సంఖ్యలో వచ్చి నివాళులు అర్పించుకున్నారు. బాలకృష్ణయ్య గారి గురువులు సాధు బ్రహ్మయ్య గారి సమాధి ప్రక్కనే వీరి సమాధి కూడా నిర్మింపబడింది. భక్తుల సహకారముతో వీరిద్దరి సమాధులను కలిపి ఒక మందిరం నిర్మించారు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశినాడు సాధు బ్రహ్మయ్యగారివి, వైశాఖ పౌర్ణమినాడు బాలకృష్ణయ్య గారివి ఆరాధనలు, భక్త సమారాధనలు వైభవముగా జరుగుతాయి.

# వివేక చూడామణి

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

**నానాత్వ నిషేధము**

**పరిపూర్ణమనాద్యంతమప్రమేయమవిక్రియమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 465

సర్వత్ర పరిపూర్ణము, ఆద్యంత రహితము, అప్రమేయము, వికార రహితము, ఏకము, అద్వితీయము అగు బ్రహ్మమే నిండియున్నది. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

**సద్ఘనం చిద్ఘనం నిత్యమానంద ఘన మక్రియమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 466

ఘనీభవించిన సత్తు చిత్తు ఆనందము ఏది కలదో ఆ నిత్యము, ఏకము, క్రియారహితము, అద్వితీయమగు బ్రహ్మమొక్కటియే సత్యము. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

**ప్రత్యగేక రసం పూర్ణమనంతం సర్వతోముఖమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 467

అంతరాత్మయు, ఏకరసము, పరిపూర్ణము, అనంతము, సర్వ వ్యాపకము అద్వితీయము అగు బ్రహ్మమొక్కటియే సత్యము. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

**అహేయమనుపాదేయ మనాధేయమనాశ్రయమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 468

విడువ వలసినది కానిది, గ్రహించవలసినది కానిది, ఎందును ఉంచుటకు శక్యము కానిది, ఇతరమైన ఆధారము ఏదియు లేనిది, అద్వితీయము అగు బ్రహ్మమొక్కటియే సత్యము. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

**నిర్గుణం, నిష్కళం, సూక్ష్మం నిర్వికల్పం నిరంజనమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 469

గుణ రహితమై, కళారహితమై, సూక్ష్మమై, నిర్వికల్పమై, నిర్మలమై యొప్పునట్టి అద్వితీయ బ్రహ్మమొక్కటియే సత్యము. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

**అనిరూప్యస్వరూపం యన్మనోవాచామగోచరమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 470

వర్ణింపనలవిగానిది, మనస్సుకు వాక్కునకు గోచరము కానిదై యొప్పు అద్వితీయ బ్రహ్మమొక్కటియే సత్యము. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

**సత్సమృద్ధం, స్వతస్సిద్ధం శుద్ధం బుద్ధమనీదృశమ్ ।**
**ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానా ఽ స్తి కించన ॥** 471

సత్యమై, వైభవసంపన్నమై, స్వతఃసిద్ధమై, శుద్ధమై, జ్ఞాన స్వరూపమై, ఉపమాన స్వరూపమై యొప్పు అద్వితీయ బ్రహ్మమొక్కటియే సత్యము. అందు వేరుగా నానా దృశ్య ప్రపంచము, బ్రహ్మ కంటె భిన్నము ఏదియును లేదు.

- సశేషం

### పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**సెప్టెంబర్ 2022**

10 శని - భాద్రపద పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ.

20 మంగళ - శ్రీగురుదశమి - శ్రీసద్గురు పాదపూజ.

26 సోమ -శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం.

**అక్టోబర్ 2022**

2 ఆది - మూలానక్షత్రం - సరస్వతీపూజ.

3 సోమ - దుర్గాష్టమి - కుంకుమపూజ

4 మంగళ - మహర్నవమి - కుంకుమ పూజ

5 బుధ - విజయదశమి - కుంకుమ పూజ.

9 ఆది - ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

20 గురు - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ

24 సోమ - నరకచతుర్దశి - శ్రీసద్గురుపాదపూజ

25 మంగళ - దీపావళి - శ్రీసద్గురుపాదపూజ, పాక్షిక సూర్యగ్రహణం

29 శని - నాగుల చవితి - శ్రీసద్గురుపాదపూజ.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

**ఒక వామనునిగ బలి నిర్వహించదలచిన యాగమునకేతెంచి,**
**అఖండ భూమండలమందు మూడడుగులను యాచించి**
**బ్రహ్మాండమైన విశ్వమునంతటినీ రెండడుగులతో ఆక్రమించి,**
**మూడవ అడుగు ఎచ్చట మోపవలెనని ఆ అసురుని ప్రశ్నించి**
**పాతాళమునకు అదిమె( మోపమని శిరస్సును వంచిన బలిని అనుగ్రహించి!**
**అట్టియాతని కీర్తి, ప్రతిష్టలను తెలియజేయు నాల్గు వేదములు,**
**ఐదు యాగములు, ఆరు అంకములు, సప్త స్వరములు**
**నిండియుండి, సంబరముల కోలాహలముతోనుండు తిరువీధులు**
**గల శీర్కాళియందలి శ్రీరామాలయమునుగాంచికండి ఉన్నతులు!**

విశేష వామన రూపమున అరుదెంచి, అఖండ భూమండల మందలి మూడడుగులను యాచించి, సమస్త బ్రహ్మాండములనన్నింటినీ రెండడుగులతో కొలిచి, మూడవ అడుగునిమ్మని అర్థించి, మహాబలిని పాతాళమునకు అణగద్రొక్కిన మృదువైన ఆ దివ్యపాదపద్మములను అర్చించండి. ఆతని కీర్తి, ప్రతిష్టలనుచాటు నాల్గువేదములు, ఐదు యాగములు, ఆరు అంకములు, సప్తస్వరములు, మరియు తిరునాళ్ళ సంబరాల సౌందర్యమును సంతరించుకొనిన తిరువీధులతో నిండియుండు శీర్కాళియందలి శ్రీరామ ఆలయమును మీరు చేరుకొని, ఆతనిని దర్శించి ఉన్నతులుకండి.

తరువాత నారాయణుడు ఆకాశవాసులకు వారి, వారి హక్కులను వారికి తెలియపరచి, పాలసముద్రమందు శయనించ వెళ్ళిపోయెను.

ఈవిధముగ మహబలిచక్రవర్తి ఘనతను వివరించిన విశ్వామిత్రులు, 'ఓ రామా! ఇకపై నేను యాగదీక్షలో నిమగ్నమై యుండబోవుటచేత, మౌనవ్రతమందుంటాను. మీరిద్దరూ రాక్షసుల వలన మా యాగమునకు ఎటువంటి ఆటంకమూ కలుగకుండా చూసుకోండి' అన్నారు. యువరాజులిరువురూ తమ విలువిద్యానైపుణ్యముతో ఆటంకము కలిగించుచున్న అసురులను సంహరించి సంతసించారు. ఆ వెనుక వచ్చిన రాక్షస నాయకుడు,

తాటకియొక్క పెద్దకుమారుడైన సుబాహువును రాముడు నేలకొరిగించి, వారి తరువాత జన్మించిన మారీచుడ్ని, పలు యోజనముల దూరం దాటి ఎగిరి సముద్రములో పడు విధమున ఆతనిపై అంబును సంధించాడు.

యాగం జయప్రదంగా ముగియడంతో విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులను ఆశీర్వదించి, 'ఇప్పుడు మనము మిథిలానగరమువైపు వెళ్లబోవుచున్నాము. విదేహరాజు జనకుడు నిర్వహించబోవుచున్న యాగమును చూద్దాము' అన్నాడు. 'యాగమును వీక్షించుటకా ఈ రాజకుమారులను మిథిలకు తోడ్కొనిపోవుచున్నాను? అక్కడ ఒక మహత్కరమైన బహుమతి రాముని రాకకొరకు వేచియున్నదికదా? దానిని రాముని వద్దకు చేర్చవలయునుకదా...' యని స్వగతంలో అనుకున్నారు విశ్వామిత్రులవారు.

- సశేషం

**భక్తమహాశయులకు విజ్ఞప్తి**

సమర్ధ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ వారు భక్తులందరికీ ప్రసాదించిన మహా ప్రసాదం "శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవములు". ఈ సంవత్సరం ది.26.09.2022 నుండి ది.06.10.2022 వరకు శ్రీకాళీవనాశ్రమంలో జరుగనున్నవి. వార్షికంగా పాలొంటున్న భక్తులు on line లో వారి పూజలు ముందుగా నమోదు చేసుకొనే ఏర్పాటు ఈ సంవత్సరం నుండి చేశాము. పూజ రుసుము చెల్లించటానికి ఈ QR కోడ్ స్కాన్ చేసి phone pay/Google pay/ paytm ద్వారా పంపవచ్చును. తరువాత మీ గోత్రము, పేరు, పూజ చేసుకొనే తేదీ, 8333067877, 9493786602 నంబరుకి మెసేజ్ పెట్టాలి. బ్యాంక్ ద్వారా పంప దలిచేవారు ఈ ఫోన్ నంబరుకి ఫోన్ చేసి అకౌంట్ నంబరు తెలుసుకొనగలరు.

Or SCAN QR CODE

TO PAY

Sri Sri Sri Hanupath Kali Vara Prasad Babu Trust

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

అంతలో ఎక్కడి నుండి వచ్చారోగాని, శ్రీ బాబు సరాసరి వారి గదిలోనికి వచ్చి 'శేషంరాజూ!' అని పిలిచారు. ఆ పిలుపు విన్న శేషంరాజుగారు ఒక్క దూకులో కుర్చీ నుంచి దిగి 'బాబూ!' అంటూ పాదాలకు చుట్టేసుకున్నారు. శ్రీ బాబు వారిని లేవదీసి 'ఏమిటి రాజూ? ఏం జరిగింది?' అని అడిగారు. శేషంరాజు గారు ఉబికి వస్తున్న దు:ఖాన్ని ఆపుకుంటూ విషయం చెప్పారు. శ్రీ బాబు వారిని ఓదారుస్తూ 'భయపడకు రాజూ! నీ పదవి ఉపయోగించుకొని



నీవు ఎన్ని లక్షలో ఆర్జించ గలిగిన అవకాశం ఉండి కూడా, ఎన్నడూ ఒక్క పైస కూడ అక్రమంగా తీసుకోలేదు. తననే నమ్ముకున్న వాళ్లకు భగవంతుడు ఎన్నడూ అన్యాయం చేయడు. నీ డబ్బు మొత్తం పువ్వులలో పెట్టి యిచ్చినట్లు రేపు ఉదయానికి నీకు చేరుతుంది. మామూలుగానే అందరి జీతాలూ యిచ్చేసెయ్యి. డబ్బు పోయిన విషయమే ఎవరికీ చెప్పవద్దు' అని గబగబా నడిచి వెళ్లిపోయారు.

కొద్ది క్షణాలసేపు 'ఇది కలా? నిజమా?' అనే దిగ్భ్రాంతిలో మునిగిన శేషంరాజుగారు అంతలోనే తెప్పరిల్లుకొని "అయ్యో! శ్రీ బాబు అలా వచ్చి వెళ్లిపోతుంటే వారిని ఉండమని అనలేదు. కనీసం బయటి వరకు వెంటైనా వెళ్లలేదే" అని జ్ఞాపకం వచ్చి పరుగున తన గది బయటకు వచ్చి, ఆఫీసు బయటకు రోడ్డు వరకు కూడా వెళ్లి, చూస్తే శ్రీ బాబు కనబడ లేదు. శేషంరాజు గారు తిరిగి ఆఫీసులోనికి వచ్చి "బాబుగారు వెళ్లిపోయారా?" అని అడిగారు. "బాబుగారు వెళ్లిపోవట మేమిటి సార్?అసలు వారు రానేలేదే?" అన్నారు.

శేషంరాజు గారు "అలాగా!" అని మాత్రం అని తమ గదిలోకి వెళ్లి ఆనందాశ్చర్యాలతో తబ్బిబ్బవుతూ "ఇది నిశ్చయంగా నా గురుదేవుల దివ్య లీల. ఆ నిశ్చయంతోనే, వారు ఆదేశించినట్లు రేపటి వరకు యీ

విషయం నోరెత్తకుండా ఊరుకుంటాను. వారు అభయమిచ్చినట్లుగా రేపు జరిగితే అది నా మహాభాగ్యమని, నా గురుదేవుల అవధులు లేని అనుగ్రహమని భావిస్తాను. లేదా, ప్రాణత్యాగం చేసి వారిలోనే చేరిపోతాను" అనుకొని యింటికి వెళ్ళిపోయారు.

మరునాటి ఉదయం శేషంరాజుగారు పూజ ముగించుకొనే సమయానికి వారి పెద్ద కుమారుడు వచ్చి "ఎవరో ఒకాయన యిప్పుడే వచ్చి యీ సంచీని నీకివ్వమని చెప్పి ఇచ్చి వెళ్ళిపోయాడు" అంటూ ఆ డబ్బు సంచీని శేషంరాజు గారి చేతిలో పెట్టాడు. శేషంరాజు గారు తమ కుమారునితో "నువ్వు పరుగెత్తుకుంటూ వెళ్ళి వెంటనే వెదకి వారిని తీసుకుని రా. ఆయన నాకు ప్రాణదానము, మాన దానము చేసిన మహానుభావుడు. పరుగెత్తు" అని తరిమారు. ఆ కుర్రవాడు వెళ్ళి, కొంత సేపటికి కనడబలేదని తిరిగి వచ్చాడు. అంతవరకు యింట్లో కూడ డబ్బు సంచీ విషయం చెప్పని శేషంరాజు గారు యింట్లో వాళ్ళందరికి జరిగిన విషయం చెప్పి "మనం నమ్ముకున్న దేవుడు మన బాబు, మనలను యిలా యీ ఆపద నుండి గట్టెక్కించారు" అన్నారు. ఇంట్లో అందరూ ఆనంద భాష్పాలతో మనస్సులలోనే కరుణామూర్తి అయిన శ్రీ బాబు దివ్య చరణారవిందాలను అభిషేకించుకున్నారు.

ఆ తరువాత యీ విషయం శ్రీ బాబుతో మనవి చేయగా వారు చిరునవ్వుతో "అలాగా! నాకేమీ తెలియదే? అయినా భగవంతుణ్ణి నమ్ముకున్న వాడు బంగారు పిచ్చుక అని మీకు తెలిసినదే గదా! ఆ భగవంతుడే మిమ్మల్ని రక్షించుకున్నాడు" అన్నారు. శేషంరాజు గారు, "మమ్మల్ని రక్షించుకున్న భగవానుడు బ్రాకెట్‌లో కాకుండా మా ఎదురుగా ఉన్న భగవానుడే" అన్నారు. (శ్రీబాబు తమ అనుగ్రహ భాషణలలో అప్పుడప్పుడు "గురుదేవుడు, అంటే బ్రాకెట్‌లో భగవానుడు...." అని చెబుతూ ఉండే వారు. అందుకని శేషంరాజు గారు "ఆ బ్రాకెట్ తీసేస్తే, గురుదేవుడే భగవానుడని, ఆ భగవానుడు ఎదురుగానే ఉన్నా"డని అన్నారు.)

- సశేషం

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# శ్రీ రమణ మహర్షి

శ్రీరమణ భగవాన్ ఎప్పుడూ సమాధి నిష్ఠులై ఉంటారు. ఆ సన్నిధిలో శాంతి సౌరభం పరిమళిస్తూ ఉంటుంది. శ్రీఅరవిందులు శ్రీరమణులను శాంతి ప్రభువు (Prince of Peace) అని అభివర్ణించారు. శ్రీరమణుని సన్నిధిలో సందేహాత్ముని హృదయంలోనే సమాధానం స్ఫురిస్తుంది. చిత్రంగా అడగని ప్రశ్నకు చెప్పకుండానే సమాధానాలు వస్తాయి.



ఆత్మ స్వరూపుడైన శ్రీ రమణుడు ప్రేమపూర్ణుడు. శ్రీరమణుని ప్రేమవాహిని సమస్త చరాచరాన్ని మనిషి, జంతువు, చెట్టు, రాయి అని భేదం లేకుండా, సమస్తాన్ని ముంచెత్తుతుంది.

శ్రీరమణుని దివ్యలోచనములు తేజోపూర్ణములు. ఆ కనుల నుండి కరుణలహరి నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఈ రహస్యాన్ని శ్రీరమణులే ఒకసారి విప్పి చెప్పారు. "నేను దీక్ష ఇవ్వటం లేదు అంటున్నారు. నేను ఇస్తూనే వున్నాను వీక్షణ దీక్ష. దీక్ష పొందిన వారికి ఈ సంగతి తెలియక పోవచ్చును" అని.

శ్రీరమణుని సమత్వాన్ని హర్షించనివారు ఉండరు. తమకు ఏ మాత్రం ప్రత్యేకత చూపటం సహించరు. ఆయనే "నేను ఎప్పుడూ, చివరిలో మొదటి వాడిని (last లోfirst) అనేవారు.

శ్రీరమణులు తమిళం, ఆంధ్ర, మళయాళ, సంస్కృత భాషలలో గ్రంథాలు వ్రాశారు. శ్రీరమణ బోధ. ఏ ప్రత్యేక దర్శనానికీ, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతములకు చెందినది కాదు. శ్రీరమణుడు స్వానుభవం నుంచే బోధించారు. ఈ బోధ ఆకాశగంగవలే స్వచ్ఛమైనది.

శ్రీరమణుని ముఖ్యబోధలివి :- 1)భగవంతునకు శరణాగతి చెందు. ఆయనే ముక్తిని అనుగ్రహిస్తాడు, లేదా, 2) నేనెవడను? అంటూ – లో చూపుతో నిరంతరం నేను యొక్కపుట్టుక స్థానాన్ని వెదకి ఆత్మను తెలుసుకో. ఈ రెండు సాధన తారతమ్యాలను, నిష్ఠలను శ్రీరమణ భగవాన్ ఇలా వర్ణించారు.

శరణాగతికి గొప్ప అర్హత కావాలి. ఒక తరగతి వారు భగవంతుడు ఉన్నాడు. ఆయనే జగత్పాలకుడు. ఆయనను శరణాగతి చెందితే ముక్తిని అనుగ్రహిస్తాడు. ఇలా బోధించేవారు ఉత్తమశ్రేణి వారు.

రెండవ తరగతివారు ఈ సత్యాన్ని గ్రహించక భగవంతుడున్నాడని మీకెలా తెలుసు? ఎట్లా ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడు? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తారు. అట్టి వారిని తృప్తి పరచటం అసాధ్యం అందుకే వారిని సూటిగా "ఈ అడిగేది ఎవరు?" అని ప్రశ్నిస్తాను. "నేను" అని జవాబు వస్తుంది. "ఆ నేను ఎవరో తెలుసుకోండి" అని అంటాను. దేవుడు లేడు అనవచ్చు కాని తను లేనని అనలేడు కదా! "నేను" నిత్య ప్రత్యక్షం."నేనెవరిని?" అని నిరంతరం ప్రశ్నిస్తే నేనుకు మూలమైన ఆత్మలోకి సులభంగా చేరుకోవచ్చు.

పై వివరణను బట్టి శ్రీ రమణుని ముఖ్యమైన బోధ శరణాగతి. ఇది శ్రీ రమణుని బోధనా మంత్రానికి 'శక్తి' అని గ్రహిస్తాం.

"నేనెవడను?" అనేది విచారణా పద్ధతి. అత్యంత తర్కయుక్తమైనది. శ్రీరమణులు ఇంకా ఇలా స్పష్ట పరుస్తున్నారు.

"నీ శరీరంలో ఎదురొమ్ముకు కుడివైపున ఆత్మ స్థానమైన ఆధ్యాత్మిక హృదయం ఉంది. ఇది యోగశాస్త్రంచెప్పే అనాహత చక్రం కాదు. "నేను అను ప్రథమ తలపు" లేక మిథ్యా నేను (జీవుడు) పుడుతోంది. దీనిని ఆశ్రయించి సమస్త తలపుల అనుభవాలు కలుగుతున్నాయి. సాధకుడు ఏకాగ్రమైన బుద్ధితో, లోచూపుతో 'నేను' ను పట్టుకొని, "నేను" యెక్క పుట్టుక స్థానాన్ని అన్వేషించాలి. అప్పుడు ఈ మిథ్య నేను పడిపోయి ఆత్మ స్వరూపంగా అనుభూతి ముద్రితమవుతుంది. ఇదే, శ్రీరమణుని విచారణామార్గం. నా మార్గం ప్రత్యక్షమైనది అని శ్రీరమణులు పలుకుతున్నారు.

శ్రీరమణులు భక్తులకు ఆధ్యాత్మిక సుఖాన్నే కాక, ఇహలోక సుఖాన్ని కూడా ఇస్తారు.

శ్రీరమణ స్మరణ సర్వశుభాలకు మూలమైన బాట. ఇందులోని రహస్యాన్ని శ్రీరమణులు విప్పారు.

భక్తుల పిలుపు జ్ఞాని హృదయానికి సోకగానే వారి హృదయంలోని కల్పవృక్షం, కామధేనువు, చింతామణులు, స్వయం సంచరితమైన మహా వేగంతో (Automatic Divine Action) వచ్చి మిమ్ము ఉద్ధరిస్తాయి. రక్షిస్తాయి.

శ్రీరమణుని ఎడమ భుజంపై చిన్న పుండు పొటమరించి పెరిగి పెరిగి రాచపుండై దేహాన్ని కబళించివేసింది.

విచార వదనులైన భక్తులను చూసి కరుణతో తన నిజ స్వరూపాన్ని శ్రీరమణులు తెలియజేశారు.

"ఈ శరీరం నేను కాదని ఎంత చెప్పినా వినక శరీర వికారాలన్ని నాకు అంట కడుతున్నారు. శరీరం ఉండుగాక! పోవుగాక! నేను ఎల్లప్పుడూ వుంటాను. అనుగ్రహ స్వరూపులైన శ్రీరమణులు 1950 ఏప్రిల్ 14 రాత్రి గం. 8-47ని॥ లకు దేహాన్ని చాలించారు.

శ్రీరమణులు దేహాన్ని వదిలిన సమయంలో ఆకాశాన గొప్ప ధవళ తేజస్సు కాంతులను చిమ్ముతూ ఈశాన్య దిక్కులో అంతర్లీనమైంది. ఈ జ్యోతి అన్ని దేశాలలోను కనబడింది. ఈశాన్యదిక్కు శివలోకం. శ్రీరమణులు కుమారస్వామి!

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

ఆగష్టు 7న దేవర గోపవర గ్రామంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణ శంఖుస్థాపన









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

## కట్టమూరు గ్రామంలో నిర్వహించిన సత్సంగ కార్యక్రమ దృశ్యములు



శ్రీసద్గురు
పాదపూజ



సామూహిక
కుంకుమ పూజలు



సత్సంగం

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.